ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (చించినాడలో శ్రీనాన్నగారి ప్రవచనము 5-3-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణుడు అంటే ఒక వ్యక్తి కాదు. కృష్ణుడు అంటే ఒక శక్తి. నన్ను ఎవడైతే ఒక మానవమాత్రుడిగా మాత్రమే గుర్తిస్తున్నాడో వాడు ఎన్ని పూజలు చేసినప్పటికీ వాడు నన్ను అవమానం చేస్తున్నట్లుగా తీసుకొంటాను అని కృష్ణుడు గీతలో చెప్పాడు. సత్యంతో సంబంధం లేని పూజలు, జపాలు ప్రయోజనం ఇవ్వవు. పూజలు చేయవద్దని కృష్ణుడు చెప్పటం లేదు, తెలుసుకొని చేయండి అంటున్నాడు. కృష్ణుడు అంటే ఆనంద స్వరూపుడు, రస స్వరూపుడు. మన మనస్సును, ఇంద్రియాలను కృష్ణరసములో ముంచితే మన మనస్సుకు, ఇంద్రియాలకు ఏకాగ్రత వస్తుంది. ఎవడైతే తన మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రపరుస్తున్నాడో వాడు తపస్సు చేసినట్లు లెక్క అని మహాభారతంలో భీష్ముడు చెప్పాడు.

ఈ రోజు శ్రీకృష్ణచైతన్య జయంతి. ఆయన శ్రీకృష్ణుడి అంశ అని చెపుతారు. ఆచార్యులవారికి కాశీ అంటే ఎంతప్రీతో, రమణమహర్షిగారికి అరుణాచలం అంటే ఎంత ప్రీతో, శ్రీకృష్ణచైతన్యుడికి పూరీ జగన్నాధం అంటే అంతప్రీతి. ఆయన శరీరం శవం అవ్వలేదు. ఆయన శరీరం వెలుగై పూరీజగన్నాధుడిలోనే ఐక్యం అయింది. అందువలన ఆయనకు సమాధి లేదు. పూరీలో ఒక ముస్లిం సమాధి ఉంటుంది. ఆ ముస్లిం శ్రీకృష్ణచైతన్యుడియొక్క భక్తుడు. ఒకసారి శ్రీకృష్ణచైతన్యుడు ఆ ముస్లింను నీకు ఏమి కావాలి అని అడిగితే నీవులేని ఈ లోకమును నేను చూడలేను, అందువలన నీ శరీరంలో ప్రాణం ఉండగానే నా శరీరంనుండి ప్రాణం పోయేటట్లు చూడు అని ఆ ముస్లిం అడిగాడట. శ్రీకృష్ణచైతన్యుడి శరీరం ఉండగానే ఆ ముస్లిం ప్రాణం పోయింది. ఆయన చేతులతోటే సమాధి చేసాడు.

13వ అధ్యాయం 8వ శ్లోకం

అమానిత్వ మదంభిత్వ మహింసా క్షాన్తి రార్జవమ్

ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః

అమానిత్వమ్ అంటే తన్ను తాను పొగడుకొనకుండుట. కొంతమంది వారిని వారు పొగడుకొంటూ ఉంటారు. వారికూడా తిరిగేవారి చేత పొగడించుకొంటారు. ఈ రకమైన మనుషులకు ఎన్ని పూజలు చేసినా జ్ఞానం కలుగదు. ఎవడైతే ఆడంబరముగా మాట్లాడుతున్నాడో, వాడిని వాడే పొగడుకోవటం పనిగా పెట్టుకొన్నాడో వాడు ఎన్ని పూజలు చేసినా, జపాలు చేసినా అవి సత్యపూజలు కావు, సత్యజపాలు కావు. వారికి జ్ఞానం వచ్చే ప్రసక్తి లేదు అని భగవంతుడు చెపుతున్నాడు.

అదంభిత్వమ్ అంటే డంబంలేకుండా ఉండటం. డంబం అంటే కొంతమంది మంచి పనులుచేస్తారు. ఈ మంచి పనులు మేము చేసాము అని లోకానికి తెలిసిపోవాలి అనుకొంటారు. మేము మంచి పనులు చేసాము అని ఈ లోకంలో వెలుగులోనికి వచ్చేయాలి అని వారు చేసిన మంచి పనులనే ఎప్పుడూ చెపుతూ ఉంటారు. వారు చేసిన మంచి పనులను వారే చెప్పుకొంటూ ఉంటే వారికి పుణ్యం రావచ్చుగాని జ్ఞానం ఎన్నటికీ రాదు.

అహింస అంటే పర ప్రాణులను హింసింపకుండుట. మాటలతో ఇతరులను గాయపరుస్తూ ఉంటే అది

కూడా హింసతో సమానమే. కొంతమంది పైకి నటిస్తారు గాని హృదయపూర్వకంగా ఇతరుల క్షేమాన్ని కోరరు. ఇదికూడా హింసతో సమానమే. ఇతరులను హింసపెడితే వచ్చే జన్మలో ఇతరులచేత హింసింపబడతాము. అది కర్మసిద్ధాంతము. నీవు అహింసా సిద్ధాంతమును అవలంభించకపోతే సత్యము నీకు తెలియబడదు. నిన్ను హింసపెట్టటానికి ఎవడైనా మాటలు అన్నా వాటిని పట్టించుకోవద్దు. ఆ తింగర మాటలు బుజాన వేసుకొంటే నీ ప్రయాణం ఆగిపోతుంది, నీ మనస్సు పాడవుతుంది. నీ మనస్సును పాడుచేసుకొంటే నీ విశాలమైన జీవితం చెడిపోతుంది.

క్షాన్తిః అంటే ఓర్పు గలిగి ఉండుట. జీవితంలో ఏపని సాధించాలన్నా ఓర్పు, పట్టుదల ఉండాలి. ఓర్పును, సహనమును పిరికితనం అనుకోకూడదు. సహనం, ఓర్పు ఉంటే దీర్ఘకాలం పోరాడే పటిమ వస్తుంది. మీకు ఏదైనా కష్టం వచ్చినా ఓర్పు, సహనం విడిచిపెట్టకండి. మీకు కూడా వెలుగువచ్చే రోజులు వస్తాయి. మీకు శాంతి కలుగుతుంది.

ఆర్జవమ్ అంటే నిదానంగా ఉండటం. వంకరలేకుండా ఉండటం. కొంతమంది మనస్సుతో ఒకటి ఆలోచిస్తారు, నోటితో ఇంకొకటి చెపుతారు, చేతితో ఇంకొకటి చేస్తారు. వారి మనస్సుకు, మాటకు, చేతకు సంబంధం ఉండదు. మనస్సుకు, మాటకు, చేతకు సంబంధంలేని మనుషులను వంకర మనుషులు అంటారు. సాధన చేస్తేగాని ఈ వంకరలు పోవు. తెపాలాకు మసి ఉంది అనుకోండి. ఒకప్రక్క తోమేసి వదిలివేయము. మసి ఎక్కడ ఉందో చూస్తాము, తోముతాము. మరల చూసుకొంటాము. అవసరమైతే మరల తోముతాము. అలాగే నీ మనస్సులో ఉన్న అన్ని కోణాలను చూసుకోవాలి. ఏ కోణంలో ఏ ఒంకర ఉందో చూసుకొని అది పోయేవరకూ సాధన చెయ్యాలి. ఇక్కడ కృష్ణుడు ముందుజాగ్రత్తకోసం చెపుతున్నాడు. నీ శరీరంలో వంకరలు ఉన్నా ఫరవాలేదు. స్మశానంలో శరీరం కాలిపోయినపుడు ఆ వంకరలు కాలిపోతాయి. నీ మనస్సులో ఉన్న వంకరలు నీకూడా వచ్చేస్తాయి. వచ్చే జన్మకు వచ్చేస్తాయి. అప్పుడైనా కష్టపడి వీటిని తొలగించుకోవాలి. ఎప్పుడో తీసుకొనేబదులు ఇప్పుడే తీసుకొంటే ఈ జన్మలోనే మోక్షం వచ్చేస్తుంది. నీ మనస్సులో ఉన్న వంకరలు ఎప్పుడైతే పోయాయో, నీ మనస్సులో ఉన్న బలహీనతలనుండి విడుదల పొంది ఎప్పుడైతే ఆత్మజ్ఞానమును పొందావో నీ శరీరం ఉన్నా, ఊడిపోయినా నీవు ఎక్కడఉన్నా బ్రహ్మానందమువచ్చి నిన్ను ముంచేస్తుంది. అప్పుడు శాంతిలో, ఆనందములో నీవు ఊగిసలాడతావు. నీకు అనుచరులు ఉన్నా, లేకపోయినా నీ మనస్సులో వంకరలు లేనపుడు నీ శాంతికి భంగం కలుగదు. విషయానందం బాహ్యమైన విషయములమీద, వ్యక్తులమీద ఆధారపడి ఉంటుంది. బ్రహ్మానందం స్వతంత్రముగా ఉంటుంది. అందులో నీవు ఊగిసలాడతావు. అప్పుడు మరణం వచ్చినాకూడా నీకు ఏమీ అనిపించదు.

ఆచార్యోపాసనం. ఆచార్యుడు అంటే గురువు. గురువును ప్రేమించు, గురువుయందు గౌరవము కలిగిఉండు. ఎవడైతే విద్యను నీకు చెపుతున్నాడో, విద్యను చెప్పటమే కాకుండా వస్తువును అనుభవంలోనికి తీసుకొనిరావటంకోసం సర్వకాల సర్వావస్థలలో ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో వాడే ఆచార్యుడు. గురువును దైవముతో సమానంగా చూడాలి. ఎప్పుడైతే గురువును గౌరవిస్తున్నామో, గురువును ప్రేమిస్తున్నామో అప్పుడు గురువు తన హృదయాన్ని Open చేస్తాడు. మీరు స్వయంగా కష్టపడి సంపాదించలేనిది ఆచార్యుడు చెప్పటంవలన మీకు తొందరగా అర్థమవుతుంది, మీకు అనుభవంలోనికి వస్తుంది.

శౌచం అంటే శుచిగా ఉండటం. బాహ్యంగా మనం అందరం శుచిగానే ఉంటున్నాము. బాహ్యంగా శుచిగా ఉండటం సరిపోదు. లోపలకూడా శుచిగా ఉండాలి. బాహ్యంగా నీ శరీరంమీద ఉన్న దుమ్ము, దూళిని స్నానంచేసి ఎలా తొలగించుకొంటున్నావో అలాగే నీ మనస్సులోను, బుద్ధిలోను ఉన్న కామక్రోధములను సాధనచేసి, విచారణచేసి తొలగించుకో, అవే నిన్ను అశుచి చేస్తున్నాయి కాబట్టి వాటిని ప్రయత్నంచేసి తొలగించుకో. కామం కామం అంటారు అది ఎక్కడ ఉంది అని అడిగితే ఇంద్రియాలలోనూ, మనస్సులోనూ,

బుద్ధిలోనూ మకాంవేసి ఉంది అని కృష్ణుడు చెప్పాడు. వెతికితే దొరుకుతుంది అని చెప్పాడు. ఇది బయట ఉంటే దానిని తేలికగానే తొలగించవచ్చు. అది నీ మనస్సులోనూ, బుద్ధిలోనూ ఉంది. అందువలన సాధనచేసి తొలగించుకో అని చెప్పాడు. కొంతమంది ఈ శవమును గుడులుచుట్టూ త్రిప్పకపోయినా ఇంటివద్దే ఉండి మానసికపూజ చేస్తారు. అంటే మనస్సుతో చేయవలసిన పూజ చేస్తారు. నిరంతరము మనస్సులో భగవంతుని స్మరిస్తూ ఉంటే నీకు శుచి కలుగుతుంది.

స్థైర్యం అంటే స్థిరంగా ఉండాలి. నీవు ఏదైనా గమ్యాన్ని పెట్టుకొన్నప్పుడు ఆ గమ్యం చేరటానికి నీవు స్థిరంగా ఉండాలి. నీకు స్థిరత్వం లేకపోతే గమ్యాన్ని చేరలేవు. ప్రతి చిన్న విషయానికి కంగారుపడుతూ ఉంటే వాడికి స్థిరత్వం లేదు అని అర్థం. నీకు స్థిరత్వం లేకపోతే జ్ఞానమును పొందలేవు.

ఆత్మవినిగ్రహః అంటే మనోనిగ్రహము కలిగి ఉండాలి. నీ మనస్సుయొక్క నిగ్రహానికి నీవు ప్రయత్నం చేయాలి. మనస్సుయొక్క నిగ్రహం అంతాకూడా ఆహార నియమంమీద ఆధారపడి ఉంది అన్నారు భగవాన్. మనం తినే ఆహారముయొక్క ప్రభావం మనస్సుమీద ఎక్కువగా ఉంటుంది. అందువలన ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండాలి. శాస్త్రములలో మనస్సును నిగ్రహించుకోమని చెపుతూ ఉంటే మనస్సును నిగ్రహించుకోవటానికి కొంచముకూడా ప్రయత్నం చేయకుండా ఆ శాస్త్రములో ఉన్న శబ్దములను పట్టుకొని ఊరేగుతూ ఉంటే నీకు మనో నిగ్రహం రాదు. శాస్త్రములు చదవటమే మనం పనిగా పెట్టుకుంటే శాస్త్రములలో ఉన్నది శబ్దములయొక్క ఆడంబరము మాత్రమే. ఆడంబరము తెలుస్తుంది. శబ్దములయొక్క అర్థం తెలుస్తుంది. పాండిత్యం వస్తుంది అంతే. ఆత్మానుభవం సంపాదించటానికి ఉండవలసినది పాండిత్యం కాదు, సహృదయం ఉండాలి అన్నారు భగవాన్.

ఏ ఇంద్రియం ఏ విషయానికి ఆకర్షింపబడుతోందో ముందు నీకు తెలియాలి. అందులో ఉన్న దోషం నీకు అర్థమవ్వాలి. ఆ దోషం అర్థమయితేగాని ఆ ఇంద్రియం మళ్ళింపబడదు. విషయచింతనవలన ఇంద్రియాలు బాహ్యంగా విజృంభిస్తాయి. విషయాలలో ఉన్న దోషమునీకు అర్థమయితేనేగాని నీ మనస్సు అంతర్ముఖం కాదు. నీకు వైరాగ్యం ఉండాలి. వైరాగ్యం లేకుండా జ్ఞానంరాదు.

అహంకారము లేకుండా ఉండాలి. అహంకారము అంటే కోపం అని చాలామంది అనుకొంటారు. అహంకారము అంటే కోపము కాదు. నీవు ఏదైతే కాదో అది అవును అనుకోవటం అహంకారము. నీవు ఆత్మవు. కాని నీవు దేహం అనుకొంటున్నావు. దేహమే ఆత్మ అనుకొంటున్నావు. నీవు ఆత్మ అయినప్పటికీ దేహాన్ని ఆత్మ అనుకొంటున్నావు. అదే అహంకారము. ఎవడైతే తన అస్తిత్వమును దేహమునకే పరిమితం చేసుకొంటున్నాడో వాడు అహంకారి. నీవు ఎవడవు? ఆత్మవు. ఆత్మకు చావులేదు, పుట్టుక లేదు. చావులేని స్థితిలో ఉన్న వైభవం మనకు తెలిస్తేనేగాని దానికోసం మనం ప్రయత్నం చేయలేము. దానివైభవం మనకు కొంత అర్థమయితే విషయాలను త్యాగంచేయగలముగాని లేకపోతే విషయాలను త్యాగంచేయలేము. ఆత్మస్థితికి సంబంధించిన అవగాహన నీకు ఉండాలి. ముందుగా ఆ స్థితిగురించి అవగాహన ఉంటే నీవు త్యాగం చేయగలవుగాని లేకపోతే త్యాగం చేసే సమస్యే లేదు. దేహమునకు పరిమితమై ఉండటమే అహంకారము. అహంకారము దగ్గర ఒక గుణం ఉంది. అది ఎప్పుడూ ఏదో ఒకదానితో తాదాప్యం పొంది వుంటుంది. ఎక్కడో ఒకచోట ఇరుక్కొంటూ ఉంటుంది. మనం ఎప్పుడైతే ఒక వస్తువుతోగాని, ఒక వ్యక్తితోగాని, ఒక విషయంతోగాని తాదాప్యం పొందామో అప్పుడు పరిమితి వచ్చేస్తుంది. పరిమితులు ఎప్పుడైతే వచ్చాయో ఆ పరిమితులలోనుండి అంతులేని దుఃఖము ప్రవాహములాగ వస్తుంది. ఈ అహంకారమును ఏ ప్రక్రియద్వారా, ఏ ఉపాసనద్వారా ఎలా విడిచిపెడతావో అలాగ దానిని విడిచిపెట్టు. ఎప్పుడైతే నీవు అహంకారమును విడిచిపెట్టావో అనహంకారస్థితి నీకు వస్తుంది. అప్పుడు సత్యం నీకు వ్యక్తమవుతుంది. ఎంత పండితుడు అయినప్పటికీ ఎంత ధనం ఉన్నప్పటికీ, ఎంత పెద్దపదవులలో ఉన్నప్పటికీ అనహంకార స్థితికి వెళితేనేగాని

సత్యం నీకు తెలియదు. ఈ అనహంకార స్థితిని పొందటంకోసమే పూర్వం అనేకమంది మహారాజులు రాజ్యములను త్యాగం చేసారు.

శరీరం పుడుతూ ఉంటుంది, రోగములు వస్తూ ఉంటాయి, మరణిస్తుంది. శరీరం వచ్చాక రోగం రాకుండా ఉండదు, ముసలితనం రాకుండా ఉండదు. వాటిలోనుండి బాధ వస్తుంది. ఎప్పుడైతే నీకు జన్మ వచ్చిందో ఆ జన్మకూడా నీకు దుఃఖము వచ్చేస్తుంది అన్న సంగతి నీకు తెలియాలి. శరీరం పుట్టిందంటే బాధ, మరణిస్తే బాధ, రోగం వస్తే బాధ, ముసలితనం వస్తే బాధ వీటిలో ఉన్నదోషాలు నీకు తెలియాలి. నీవు దూరదృష్టితో వీటిగురించి ఆలోచించి శరీరం వస్తే ఇన్ని బాధలు ఉన్నాయికదా అని గ్రహించి శరీరం రాకుండా చేసుకొనే స్థితి అంటే మోక్ష స్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. దేహంకోసం విలపించవద్దు. దేహం వచ్చిందంటే ఇన్ని అరిష్టాలు వస్తాయి. ఇందులో ఉన్న దోషాలు నీవు గ్రహిస్తే ఆ దోషాలనుండి బయటపడటానికి ప్రయత్నిస్తావుగాని అందులో ఉన్న దోషమే నీకు తెలియనపుడు అందులోనుండి బయటకు రావటానికి నీవు ప్రయత్నం చేయవు అని చెపుతున్నారు.

అభిమానం పెట్టుకోవద్దు. నీకు భార్య ఉండవచ్చు, పిల్లలు ఉండవచ్చు, ఇల్లు ఉండవచ్చు. వీటిమీద అభిమానం పెట్టుకోవద్దు. యజమాని ఉన్నాడు అనుకోండి. ఇంటిలోనివారికి రోగం వస్తే తనకే వచ్చింది అనుకొంటాడు. ఇటువంటి తింగరపనులు వద్దు అని చెపుతున్నాడు. నీ భార్యకు రోగం వచ్చింది అనుకో, వైద్యం చేయించు. అంతేగాని ఆరోగం నీకే వచ్చింది అనుకోవద్దు. ఎంత వివరంగా చెపుతున్నాడో చూడండి. ఆ రోగం నీకే వచ్చింది అనుకొంటే నీవు ఆధ్యాత్మికంగా వికాశం పొందలేవు. నీ భార్యకు వచ్చిన రోగము, నీ బిడ్డకు వచ్చిన రోగం నీకే వచ్చింది అని నీవు అనుకొంటూ ఉంటే అక్కడ నీకు బంధం ఎక్కువగా ఉంది అని అర్థం. అలా ఉంటే నీవు ఆధ్యాత్మిక జీవితానికి పనికిరావు. పుత్రుడుమీదగాని, భార్యమీదగాని, గృహంమీదగాని వారిపట్ల నీకు చేయవలసిన డ్యూటీని చేయవయ్యా. వారికి వచ్చిన బాధగాని, కష్టంగాని నీకే వచ్చేసింది అనుకోవద్దు. అటువంటి అభిమానం పెట్టుకోవద్దు. భగవంతుడు నీకు ఏ పనిని అయితే ఇచ్చాడో దానిని చేసేసి వదిలివేస్తూ ఉండు. ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తి పెట్టుకోవటంవలన టెన్షన్ వస్తుంది. పనిలోనుండి నీవు రిటైర్ అవ్వనక్కరలేదు. ఆసక్తినుండి రిటైర్ అవ్వమని చెపుతున్నాడు. ఫలదృష్టిలోనుండి రిటైర్ అవ్వు. ఎవడైతే ఆసక్తి లేకుండా పనిచేస్తున్నాడో వాడికి **work**లోనే **rest** కలుగుతూ ఉంటుంది. ప్రత్యేకంగా **rest** అక్కరలేదు.

శరీరం వచ్చాక సుఖం వస్తుంది, దుఃఖం వస్తుంది. తల్లి కడుపులోనుండి ఈ శవం బయటకు వచ్చిన తరువాత మరల స్మశానంకు వెళ్ళేవరకూ సమానంగా ఎవ్వరకూ రోజులు వెళ్ళవు. జీవితంలో **ups, downs** ఉంటాయి. **Ups** వచ్చినపుడు సంతోషంగా ఉంటుంది. **Downs** వచ్చినపుడు దుఃఖముగా ఉంటుంది. **Ups, downs** లేకుండా ఎవడి జీవితం వెళ్ళదు. గౌరవాలు వస్తూ ఉంటాయి, అవమానాలు వస్తూ ఉంటాయి. వస్తే రానియ్యి నీ మనస్సును సమానంగా ఉంచుకో. నీ దేహం ఎంత నిజమో నీకు వచ్చే గౌరవము, అవమానంకూడా అంతే నిజము. నా దేహమే నాది కానపుడు దేహమునకు బయట ఉన్న వస్తువులు, గొడవలు నావి ఎలా అవుతాయి అన్నాడు బుద్ధుడు. **24**గంటలు నాతో ఉండే దేహమే ఏదో రోజు నన్ను విడిచిపెట్టేస్తోంది.

అరుణాచలం వచ్చిన కొత్తలో ఆకలిబాధ, ఇప్పుడు అజీర్తి బాధ అనేవారు భగవాన్. అలాగని అప్పుడు దుఃఖము లేదు, ఇప్పుడు ఆనందము లేదు. అది దేహప్రారబ్ధము. అప్పుడు దేహం అలా ఉండవలసి వచ్చింది. ఇప్పుడు ఇలా ఉండవలసి వచ్చింది. అప్పుడు రాళ్ళమీద కూర్చోవలసి వచ్చింది, ఇప్పుడు సోఫామీద కూర్చోవలసి వచ్చింది. అదీ నిజంకాదు, ఇదీ నిజంకాదు. అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. అప్పుడు ప్రశ్నలు వేసేవారు లేరు. ఇప్పుడు అన్నీ ప్రశ్నలే. అది దేహ ప్రారబ్ధము. అరుణాచలేశ్వరుడు

రమణమహర్షిని మధురనుండి అరుణాచలం బోధకోసం తీసుకొనివచ్చాడు. రమణమహర్షి అరుణాచలం వచ్చినరోజునే అరుణాచలేశ్వరుడితో భక్తి, జ్ఞానములను ప్రసాదించు అని అడుగలేదు. నీవు రమ్మంటే నేను వచ్చాను. నా అంతట నేను రాలేదు. నీవు రమ్మంటేనే ఈ దేహము ఇక్కడకు వచ్చింది. ఈ దేహమును నీవు ఎలాగ ఉపయోగించుకొంటావో అలాగ ఉపయోగించుకో అన్నాడు. అదీ శరణాగతి. శరణాగతికి మించిన ప్రార్థన లేదు.

భక్తి మంచిదే గాని వ్యభిచార భక్తి పనికిరాదు అని భగవంతుడు చెపుతున్నాడు. వ్యభిచార భక్తి అంటే చాపల్యముతో కూడిన భక్తి. రమణమహర్షికి అరుణాచలేశ్వరుడిమీద ఉన్న భక్తి అవ్యభిచార భక్తి. అరుణాచలంలో 54 సంవత్సరాలు ఉన్నాను. ఈ 54 సంవత్సరాలలో ఈ అరుణాచలంను విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలని తలంపుకూడా రాలేదు అన్నారు భగవాన్. అది అవ్యభిచార భక్తి. తలంపు వచ్చిన తరువాత నిగ్రహించుకోవటంకాదు ఆ తలంపే రాలేదు అన్నారు. అరుణాచలేశ్వరుడు తనకంటే భిన్నంగాలేడు అని తెలిసికూడా అరుణాచలేశ్వరుడిమీద అంత భక్తి ఉంది. తను జ్ఞాని అయి ఉండికూడా అరుణాచలేశ్వరుడిమీద అంత ప్రేమ ఉంది అంటే అది అవ్యభిచారభక్తి. నీకు అవ్యభిచారభక్తి ఉండాలి అని భగవంతుడు చెపుతున్నాడు. భక్తుడు అహంభావనకోసం మాటాడడు. భగవంతుని వైభవమును వెలుగులోనికి తీసుకొనిరావటానికి మాట్లాడతాడు. నన్నే గమ్యంగా పెట్టుకొని, నీవు ఏది మాట్లాడినా నా వైభవం వెలుగులోనికి రావటానికి మాట్లాడుతూ, నాకంటె మించిన ఫలం నీకు ఏమిలేదు అనే గుర్తింపు కలిగి ఉండి, నాకోసమే జీవించాలి అని భగవంతుడు చెపుతున్నాడు. నీకు జన్మ వచ్చింది కాబట్టి పొందదగినవాడిని నేనే. నాకంటే పొందదగిన వస్తువు నీకు ఏదీ లేదు. నేను తప్పించి మిగిలినవన్నీ నీకు స్వప్న సమానము. దీనిని అర్థం చేసుకొంటే శాంతి నీకు అందుతుంది. నీవు ఎల్లప్పుడూ నాపట్ల అవ్యభిచార భక్తి కలిగి ఉండు అని భగవంతుడు అంటున్నాడు.

ప్రాపంచిక మనుషుల దగ్గర కూర్చొని ఆ మాటలను వింటూ ఆ రుచిని అనుభవిస్తూ ఎవడైతే ఉంటాడో వాడు నాకు భక్తుడు కాదు, వాడు పనికిరాడు, వాడు నన్ను చేరుకోలేడు అంటున్నాడు భగవంతుడు. కొంతమంది ప్రకృతిమనుషులు ఉంటారు. వారికి ప్రకృతి గొడవలు తప్పించి పురుషోత్తముడి గొడవ ఏమీ ఉండదు. దేవుడి గొడవలు చెప్పరు. ఇతరులు బుద్ధిమంతులు కాదు అని చెపుతూ ఉంటారు. ఇటువంటి మనుషులదగ్గర కూర్చొనే రుచిగనుక నీకు ఉంటే నీవు ఆధ్యాత్మిక జీవితానికి పనికిరావు అని చెపుతున్నారు. ఎంత వివరంగా చెపుతున్నాడో చూడండి. ప్రాపంచిక మనుషులు చెప్పుకొనే మాటలమీద నీకు ప్రీతి కలుగుతూ ఉంటే నీకు భక్తి కలుగదు. ప్రాపంచిక మనుషులను చూసి నీకు ఎప్పుడైతే ఆకర్షణ కలుగుతోందో అప్పుడు నీ మనస్సు భగవంతునివైపుకు వెళ్ళదు. ఎంతసేపు ప్రాపంచిక మనుషులదగ్గరకు వెళ్ళి కూర్చోవాలి అనే తలంపుకంటే కొంతసేపు ఏకాంతముగా కూర్చొని భగవంతుని ధ్యానించుకొందాము అనే ప్రీతి ఉండాలి.

రమణమహర్షిగారిలో ఒక చిక్కు ఉంది. మనం ఏదో ఆధారములు పెట్టుకొని జీవించటానికి చూస్తాము. ఆయన ఆధారములు ఊడగొడుతూ ఉంటాడు. మనం కూర్చొన్న ఆధారములు ఊడగొడతాడు. ఏకాంతము అంటే ఎవరూ లేకుండా మనఅంతట మనం ఒంటరిగా కూర్చొని ధ్యానం చేసుకోవటం అని అనుకొంటాము. మామూలుగా అర్థం అదే. రమణమహర్షిగారు ఏమని చెప్పారు అంటే ఏకాంతము అనేది నీ గదిలో లేదువయ్యా నీ హృదయంలో ఉంది అని చెప్పారు. నీ హృదయగుహలో నీవు ఉండగలిగితే ఏకాంతము అంటే ఏమిటో నీకు తెలుస్తుంది. గదిలో కూర్చొని తలుపులు వేసుకొంటేనే ఏకాంతస్థితి వచ్చివేయదు. నీ బుఱ్ఱలో గొడవలు ఎక్కడికి పోతాయి. నీ హృదయంలోనే ఏకాంతస్థితి ఉంది. నీ బుద్ధిని, నీ మనస్సును హృదయంలో నిలబెట్టాలి. నీ బుద్ధిని, నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచగలిగితే అది ఏకాంతము అన్నారు భగవాన్. జనం కనబడకుండా తలుపులు వేసుకొని కూర్చొంటే ఏకాంతము కాదు.

రమణమహర్షిగారు చెప్పిన ఏకాంతముమాట వదిలివెయ్యండి. కనీసము మనం అనుకొన్నట్లుగా అయినా కొంతసేపు ఒంటరిగా కూర్చొంటే మన మనస్సులో ఉన్న గొడవలు తెలుస్తాయి. మన మనస్సులో ఉన్న దోషములు తెలుస్తాయి. ఏ తలంపులు అయితే మనలను బంధిస్తున్నాయో అవే మనం ఏకాంతముగా ఉన్నప్పుడు వచ్చి కూర్చొంటాయి. మనస్సులో ఉన్న దోషములు తెలుస్తాయి కాబట్టి అప్పుడు వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేయగలము. ఏకాంత వాసము, సహవాసము, ఉపవాసము, ఇవి మూడూ కూడా ఆధ్యాత్మిక పురోభివృద్ధికి సహకరిస్తాయి.

వ్యవహార రీత్యా ప్రకృతి మనషులతో కొన్ని సంబంధాలు ఉంటాయి. ఎంతవరకూ వారితో సంబంధమో అంతవరకే సంబంధం పెట్టుకోవాలి. అంతేగాని వారిదగ్గర కూర్చోవటంవలన నీకు సంతోషం వస్తూ ఉంటే నీవు ఆధ్యాత్మిక జీవితమునకు పనికిరావు. ప్రకృతి సహవాసములవలన నీవు పొంగిపోతూ ఉంటే నిన్ను అసలు పిలువనే పిలువను అంటున్నాడు. అసలు Call ఇవ్వను అంటున్నాడు. ఏదైనా ఉద్యోగంకోసం దరఖాస్తు పెట్టుకొన్నాము అనుకోండి. ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వస్తే తరువాత ఉద్యోగము రావచ్చును, రాకపోవచ్చును. అసలు ఇంటర్వ్యూ రాలేదు అనుకోండి. ఇంక ఉద్యోగం ఏమి వస్తుంది. ఇక్కడ కృష్ణుడు ఏమి చెపుతున్నాడు అంటే ప్రకృతి సహవాసమువలన నీకు సంతోషం వస్తూ ఉంటే నీకు అసలు ఇంటర్వ్యూకే call ఇవ్వను అంటున్నాడు. నీకు అసలు పిలుపే రాదు అని చెపుతున్నాడు. అందువలన సహవాసము విషయంలో జాగ్రత్త అవసరము. ఆత్మజ్ఞానమును పొందటానికి నీ శక్తిని, యుక్తిని కేంద్రీకరించు. నిరంతరము నీ మనస్సును ఆత్మయందు నిలబెట్టి ఉంచాలి. నీ మనస్సును ఆత్మయందు నిలబెట్టి ఉంచలేకపోతే నీకు ఇష్టమైన దేవుడిమీదో, గురువుమీదో నిలబెట్టి ఉంచాలి. ఆత్మజ్ఞాన సముపార్జనపట్ల నీవు ఇష్టం కలిగి ఉండాలి. ఆత్మజ్ఞానమును సంపాదించాలి అనే ప్రయత్నంలో నీవు ఉండాలి. అలా ఎప్పుడు ప్రయత్నం చేస్తావు అంటే ఆ విలువ నీకు తెలిసినపుడు నీవు ప్రయత్నం చేయగలవు.

డబ్బు సంపాదించేవాడు డబ్బు సంపాదిస్తే ఇంత భోగం ఉంటుందికదా అని ఊహించుకొంటూ ఉంటాడు. వాడికి ఆ భోగంమీదే దృష్టి ఉంటుంది. పదవికోసం ప్రయత్నం చేసేవాడు అది వస్తే ఇంతగౌరవం ఉంటుంది కదా అని ఊహించుకొంటాడు. వాడి దృష్టి అంతా గౌరవంమీద ఉంటుంది. అలాగే నీవు తత్వజ్ఞానమును సంపాదిస్తే తత్వజ్ఞానమువలన వచ్చే మోక్షంయొక్క వైభవము ఎటువంటిదో కొంచెము ఊహించవయ్యా అంటున్నాడు కృష్ణుడు. ఆ Devine State మనకు అనుభవంలోనికి వచ్చినపుడు దేవుడు వచ్చి ఎదురుగా నిలబడినా కళ్ళెత్తి చూడాలని అనిపించదు. అటువంటి స్థితి నీ హృదయంలోనే ఉంది. జ్ఞానమువలన ఆ స్థితిని పొందుతావు. అందువలన ఆ స్థితిని ఊహించవయ్యా.

ఇంతవరకూ నేను చెప్పినది జ్ఞానం అని కృష్ణుడు చెపుతున్నాడు. కాని ఆయన చెప్పినది జ్ఞానంయొక్క లక్షణాలు. జ్ఞానంయొక్క లక్షణాలు చెప్పి జ్ఞానం అంటాడు ఏమిటి? జ్ఞానంయొక్క లక్షణాలు నీకు ఉంటే జ్ఞానం వచ్చేసినట్లే. జ్ఞానంయొక్క లక్షణాలు నీకు ఉంటే నీ కోరికతో సంబంధం లేకుండా, నీ ప్రేరణతో సంబంధం లేకుండా జ్ఞానంవచ్చి నిన్ను వరిస్తుంది. ఈ లక్షణాలు ఉంటే జ్ఞానం నిన్ను వరిస్తుంది కాబట్టి ఈ లక్షణాలు చెప్పి జ్ఞానం అంటున్నాడు. ఈ జ్ఞానలక్షణాలు లేవు అనుకోండి వారిమాట ఏమిటి అని అడగనక్కరలేదు వారు అంతా అజ్ఞానములో ఉన్నట్లే. ఈ జ్ఞానలక్షణాలు ఎవరిదగ్గర అయితే లేవో వారు అజ్ఞానములో ఉన్నట్లే.

నాకు చిన్నప్పుడే తల్లిపోయింది. నాకు తల్లిలేని లోటు ఎప్పుడూ కనబడలేదు కారణం భగవద్గీత అన్నారు గాంధీగారు. నాకు ఏదైనా సందేహం వస్తే దానికి సమాధానం గీతలో ఏదో అధ్యాయంలో ఏదో శ్లోకంలో దొరికేది అని ఆయన చెప్పారు. అందువలన గీత కారణంగా నాకు తల్లి లేని లోటు కనబడలేదు అన్నారు. ఆయనకు ఎంతపని ఉన్నప్పటికీ రోజూ ఒకటో రెండో శ్లోకాలు చదవకుండా విడిచిపెట్టేవారు కాదు.

✪✪✪